క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

కూనవరం: మండలంలోని కేజీబీవీ కూనవరం (కోతులగుట్ట) నందు 2023–24 సంవత్సరానికి 6,7,8,9 తరగతులతో పాటు ఇంటర్ (ఇంగ్లిషు మీడియంలో) ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కల్లూరి కృష్ణవేణి ఆదివారం తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 20వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా http//ap.kgbv.apcpss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మిగిలిన వివరాల కోసం 9676185847 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఆదివాసీ నేతల నిరసన

చింతూరు: బోయ, వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన ఆదివాసీలకు ఎలాంటి అన్యాయం జరగదంటూ ఎమ్మెల్యే బాలరాజు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం చింతూరులో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. నరేష్, సురేష్, వెంకటరమణ, చిన్నారెడ్డి, సీతారామయ్య, రాజు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

మారేడుమిల్లి: తూర్పు గోదావరి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మారేడుమిల్లితో పాటు చట్టుపక్కల ఉన్న పలు గ్రామాల నుంచి ప్రజలు ఈ వైద్య శిబిరానికి తరలివచ్చారు. రాజమండ్రికి చెందిన ప్రముఖ డాక్టర్లు సత్యకృష్ణ, నిఖిత, నీలిమలు 300 మందికి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఉయ్యాలా... జంపాలా...



కర్రలతో తయారుచేసిన ఊయల

అనంతగిరి: ఉయ్యాలా.. జంపాలా.. అంటూ ఈ చిన్నారులు ఉయ్యాలా ఊగుతున్న ఈ దృశ్యం చూశారా.. ఓ తండ్రి తన పిల్లల కోసం ఇంటిముందు కర్రలతో తయారుచేసిన ఉయ్యాలను ఏర్పాటు చేశాడు..అనంతగిరి మండలంలోని భీసుపురం గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు.. తన ఇద్దరు పిల్లలు కర్రలతో ఇలా ఉయ్యాలను తయారుచేశాడు. అరకు–విశాఖ ప్రధాన రహదారిలో ఈ చిత్రం 'సాక్షి' చిక్కింది.

పాల్తేరులో ఏకాహం

పాయకరావుపేట : పాల్తేరు గ్రామ రామాలయంలో ఏకాహం నిర్వహిస్తున్నారు. ముత్యాలమ్మగుడి వద్ద నున్న రామాలయంలో ఆదివారం ఉదయం నుంచి సోమ వారం ఉదయం వరకు ఏకాహం నిర్వహిస్తారు. పాల్తేరు, అంకంపేట గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొని భక్తి శ్రద్ధలతో ఏకాహం నిర్వహిస్తున్నారు.

పాపికొండల విహారానికి పోటెత్తిన పర్యాటకులు

వీఆర్‌పురం: మండలంలోని పోచవరం బోట్ పాయింట్ నుంచి ఆదివారం ఐదు బోట్లలో 361 మంది పాపికొండల విహారానికి వెళ్లారని ఏపీ టూరిజం ఇన్‌చార్జి మేనేజర్ సీహెచ్.రాజేష్ తెలిపారు. తెలిపారు. పర్యాటకుల రాకతో పోచవరం బోట్ పాయింట్, పేరంటపల్లి శివాలయం ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

తొలిదశ ముంపు గ్రామాల్లో చేర్చాలని వినతి

చింతూరు: వరదలకు అన్ని గ్రామాల కంటే ముందుగా ముంపునకు గురవుతున్న తమ గ్రామాలను తొలిదశ(41.15 కాంటూరు లెవల్)లో కలపాలని మండలంలోని చూటూరు, ముకునూరు గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్‌ను కోరారు. ఎల్లవరంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం 45.72 కాంటూరులో ఉన్న తమ గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చేలా కృషి చేయాలని విన్నవించారు. విఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన వారికి హామీనిచ్చారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, మండల పార్టీ కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, సవలం బజారు, సవలం దారయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజయీభవ



కూనవరం పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలరాజు

- నేటి నుంచి టెన్త్ పరీక్షలు
- జిల్లాలో 63 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- 11,522 మంది టెన్త్ విద్యార్థులకు హాల్‌టికెట్లు
- పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు చర్యలు
- నాలుగు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు
- సెంటర్లలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి జరిగే టెన్త్ పరీక్షలకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల పరిధిలోని ఏర్పాటు చేసిన 63 పరీక్షా కేంద్రాల్లో టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు జిల్లాలోని డీఈవోతో పాటు అన్ని మండలాల ఎంఈవోలను ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో బెంచీలు తదితర సౌకర్యాలు కల్పించారు.

ఆదివారం మధ్యాహ్నం నాటికి పనులన్నీ పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు సౌకర్యాలను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బందిని కూడా నియమించి పూర్తిస్థాయిలో మందులను అందుబాటులో ఉంచినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ భాషా సాక్షికి తెలిపారు. పరీక్షకు విద్యార్థులు ఉదయం 9.30 నిమిషాలకే చేరుకోవాలన్నారు. ఐదు నిమిషాలు దాటితే ప్రవేశం ఉండదని హెచ్చరించారు. అన్ని పరీక్షా కేంద్రాల ఆవరణలో పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ కూడా అమలు చేస్తున్నారు.సమస్యాత్మక పరీక్షా కేంద్రాలైనా ముంచంగిపుట్టు సిపిహెచ్ స్కూల్ సెంటర్, అరకులోయ మండలం కె.బల్లుగూడ సెంటర్, వై.రామవరం మండలం ఎర్రగడ్డ స్కూల్ సెంటర్, కూనవరం సెంటర్లలో భద్రతా చర్యలను విస్తృతం చేశారు. ఆయా కేంద్రాల్లోని అన్ని గదుల్లోను సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

11,522 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ

జిల్లాలోని 63 పరీక్షా కేంద్రాల పరిధిలో 11,522 మంది టెన్త్ విద్యార్థులకు విద్యాశాఖ హాల్‌టికెట్లను పంపిణీ చేసింది. వీరిలో రెగ్యూలర్ విద్యార్థులు 10,975 మంది, ప్రైవేట్ విభాగంలో 547 మంది విద్యార్థులు సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు రాయనున్నారు.

గిరిజన విద్యాలయాల్లో తల్లిదండ్రుల సందడి

సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానుండంతో జిల్లాలోని అన్ని గిరిజన విద్యాలయాల్లో తల్లిదండ్రుల సందడి నెలకొంది. ఆదివారం ఆయా ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకుల విద్యాలయాలకు చేరుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలతో చాలా సమయం గడిపారు. టెన్త్ పరీక్షలకు వారిని మానసికంగా సిద్ధం చేయడంతో పాటు, పరీక్షలు బాగా రాయాలని, మంచి మార్కులు సాధించాలని ఆశీర్వాదాలు అందించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కూడా తమ టెన్త్ పిల్లలకు అన్ని విధాల ధైర్యాన్ని ఇస్తున్నారు. టెన్త్‌లో నూరుశాతం ఫలితాల లక్ష్యంగా విజయీభవ అంటూ తల్లిదండ్రులు తమ పిల్లలతో సందడి చేశారు.



జడ్డంగి ఆశ్రమోన్నత పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈవో తాతబ్బాయిదొర

అరకులోయ రూరల్: మండలంలోని కొత్తభల్లుగూడ, కంఠభంసుగూడ, గురుకులం, అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

సుమారు 800 మంది పరీక్షలు రాయనున్నట్టు, 42 మంది ఇన్విజలేటర్లు ఏర్పాటుచేసినట్టు ఎంఈవో సత్యనారాయణ చెప్పారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగా సెంటర్లకు హాజరుకావాలని సూచించారు.

అనంతగిరి: మండల పరిధిలో నాలుగు కేంద్రాల్లో మొత్తం 666 విద్యార్థులు టెన్త్ పరీక్ష రాయనున్నట్టు ఎంఈవో ఎల్.బి.వెంకటరావు చెప్పారు.

డుంబ్రిగుడ: మండలంలోని మూడు సెంటర్లలో 573 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్టు, 34 మంది ఇన్విజలేర్లను నియమించినట్టు ఎంఈవో రామచంద్రరావు తెలిపారు.

పెదబయలు: మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 554 మంది విద్యార్థులు టెన్త్ పరీక్ష రాయనున్నట్టు ఎంఈవో కె.సింహాచలం తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో 31 మంది ఇన్విజలేటర్లు పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 590 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నట్టు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు వేణుగోపాల్, బాలరాజు, కృష్ణమూర్తి, సుబ్రదమ్మ తెలిపారు.



పాడేరు తలారిసింగి పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన బెంచీలు

చింతపల్లిరూరల్: మండలంలోని మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పది పరీక్షలకు 610 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు సీహెచ్ స్కూలు హెచ్‌ఎం రామరాజు తెలిపారు.

మారేడుమిల్లి: మండల పరిధిలో రెండు సెంటర్లలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు 330 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు.

చింతూరు: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. 588 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు పేర్కొన్నారు. ఇద్దరు ఇన్విజిలేటర్లను నియమించినట్టు ఆయన తెలిపారు.

కూనవరం: మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో నీలి బాలరాజు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు వెంకట్రావు, సీతారాములు, డీవోలు కె.లచ్చిరెడ్డి, అబ్బులు నియామకమైనట్టు తెలిపారు.

వీఆర్ పురం: మండలంలోని రెండు కేంద్రాల్లో నిర్వహిస్తున్న టెన్త్ పరీక్షలకు 185 మంది పరీక్ష రాయనున్నట్టు ఇన్‌చార్జి ఎంఈవో వి.వి.లక్ష్మీనారాయణ చెప్పారు.

రాజవొమ్మంగి: మండలంలోని నాలుగు సెంటర్లలో 491 మంది విద్యార్థులు టెన్త్ పరీక్ష రాయనున్నట్టు ఎంఈవో తాతబ్బాయిదొర చెప్పారు.28 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఐటీడీఏ పీవో శుభాకాంక్షలు



ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: టెన్త్ పరీక్షలను సోమవారం నుంచి రాస్తున్న గిరిజన విద్యార్థులకు పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన విద్యాలయాల్లోను నాణ్యమైన విద్యను అందించామని, వెనుకబడిన విద్యార్థులను కూడా పరీక్షలకు సిద్ధం చేయడంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎంతో శ్రమించారన్నారు. గిరిజన విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.గిరిజన విద్యార్థుల పోటీపరీక్షలకు, ఉన్నత చదువులకు ఐటీడీఏ అండగా ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పామ్ సండే



కొత్తబల్లుగూడలో సువార్త నిర్వహిస్తున్న మాణిక్యం,జ్ఞానమ్మ దంపతులు



మొండిజామిగుడ గ్రామంలోని మట్టలతో క్రీస్తు సోదరులు



చర్చి వద్ద మట్టలతో క్రైస్తవులు

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

అరకులోయ రూరల్: జిల్లాలోని పలు చర్చిల్లో పామ్ సండే (మట్టల ఆదివారం) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈత కొమ్మల చివర రంగురంగుల పూలు గుచ్చి ఊరేగింపుగా చర్చిలకు తీసుకెళ్లారు. ప్రతి ఈస్టర్ పండుగకు ముందు రోజు వచ్చే రోజునే మట్టల ఆదివారంగా భావిస్తారు. పాస్టర్లు మాట్లాడుతూ పామ్ సండే ప్రత్యేకత వివరించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని, పొరుగువారిని ప్రేమించాలని పిలుపునిచ్చారు. మండలంలో కొత్తభల్లుగూడలోని చర్చిలో ఆర్ట్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ మినీస్ట్రిస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ మాణిక్యం, ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండుగ నిర్వహించారు. జ్ఞానమ్మ, గ్రామ సేవకులు, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి/చింతపల్లిరూరల్: అనంతగిరి మండలంలోని మొండిజామిగుడలోని జోయ్ అండ్ పీస్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో పాస్టర్ పేతురు ఆధ్వర్యంలో పామ్ సండే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.చింతపల్లి మండలంలోని చర్చిల్లో పామ్ సండే పర్వదినాన్ని జరుపుకున్నారు.

చింతూరు: స్థానిక సీఎస్ఐ దేవాలయంలో పామ్ సండేను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టేట్ చైర్మన్ ఏసురత్నం ఏసుక్రీస్తు పునరుద్ధానం గురించి ఆధ్యాత్మిక ప్రసంగం వినిపించారు.

మారేడుమిల్లి : స్థానిక సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ బి.భాస్కరరావు మాట్లాడుతూ క్రీస్తు బోధనలను వివరించారు. చర్చి సంఘం పెద్దలు అభిమ్‌రాజ్, విల్సన్, అజిత్, శారదా, వేదమణి, మంగన్న దొర, సతీష్, అనిల్ ప్రసాద్ (బాబీ) తదితరులు పాల్గొన్నారు..

రాజవొమ్మంగి: అప్పలరాజుపేట బేతేలు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ ఇస్రాయేలు క్రీస్తు సువార్తను వినిపించారు.

ఎటపాక: జీకే పాడు లూథరన్ చర్చిలో టీఎఫ్‌టీ హాస్టల్‌లో ప్రత్యేక క్రైస్తవ గీతాలను ఆలపించారు.ఫాదర్ ఏలియా గౌరిదేవిపేట చర్చిలో ఫాదర్ నవీన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వాదాలు ఆందజేశారు.



ఈత మట్టలతో గౌరీదేవిపేటలో ప్రార్థనలకు వచ్చిన క్రైస్తవులు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్



మారేడుమిల్లిలో సీఎస్ఐ చర్చి వద్ద మట్టలతో చిన్నారులు, సంఘం పెద్దలు

'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీటూ నాయకులు

అడ్డతీగల: కార్మిక కర్షక హక్కుల సాధనలో భాగంగా ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ అడ్డతీగలలో ఆదివారం సీఐటీయూ మండల అధ్యక్షుడు గుల్లల సురేష్ గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనాల అమలుతో పాటు కర్షకులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కల్పన అనేవి ప్రధానాంశాలుగా ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించడానికి చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని కార్మిక, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులు, మధ్యాహ్న భోజన వర్కర్లు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శరవేగంగా భూ రీసర్వే



రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి

రాజవొమ్మంగి: ప్రస్తుతం మండల వ్యాప్తంగా జరగుతున్న జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం ఎంతో ప్రాధాన్యమైనదని తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి అన్నారు. గింజర్తిలో ఆయన పట్టాదారు రైతులతో ఆదివారం సమావేశమయ్యారు. భూ సర్వే ఆవశ్యకతను, ఉపయోగాలను ఆయన రైతులకు వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 12 గ్రామాల్లో సర్వే పూర్తికాగా మరో మూడు గ్రామాల్లో సర్వే చురుకుగా సాగుతోందన్నారు. సోమవారం నుంచి గింజర్తిలో సర్వే ప్రారంభిస్తామన్నారు. మండలంలో మొత్తం 62 రెవెన్యూ గ్రామాలున్నాయని, మిగతా గ్రామాల్లో కూడా యుద్ధ ప్రాతిపదికన సర్వే చేపడతామన్నారు. వీఆర్వో మహాలక్ష్మి పర్యవేక్షించారు.

జోరుగా పనస వ్యాపారం



సంతలో వ్యాపారులు కొనుగోలు చేసిన పనసకాయలు



వ్యాన్‌లో ఒడిశాకు తరలిస్తున్న పనసకాయలు

- సరిహద్దులో భారీగా వ్యాపారం
- గ్రామాల్లోకి వెళ్లి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ఆంధ్రా నుంచి ఒడిశాకు వేలాది టన్నుల సరఫరా

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో పనసకాయల వ్యాపారం భారీగా జరుగుతుంది. ఒడిశాలో పనసకాయలకు గిరాకీ నెలకొన్న నేపథ్యంలో వ్యాపారులు గ్రామాల్లోకి వెళ్లి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రతి రోజు ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని గిరిజన గ్రామాల నుంచి వ్యాన్లు, లారీల్లో పనసకాయలను తరలిస్తున్నారు.వారపు సంతల్లో ఈసారి కిలో పనసకాయల ధర ఎన్నడూ లేని విధంగా మొదట్లో రూ.15 నుంచి రూ.25 వరకు ధర పలికింది.తాజాగా కిలో రూ.35 వరకు విక్రయిస్తున్నారు. వర్షాలు మొదలైతే పనసకాయలు పాడైపోతాయి అనే ఉద్దేశంతో ముందుగానే కాయలను చెట్టు నుంచి కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు.పనసలో రెండు రకాలు ఉంటాయి.అందులో ఖర్జూరం రకం కాయలను పండ్లుగా విక్రయించేందుకు చెట్లకే ఉంచేశారు. గుజ్జు రకం పనసకాయలను మార్కెట్‌కు సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట మండలాల నుంచి ఒడిశాలోని జయపురం మార్కెట్‌కు ప్రతి రోజు 100 టన్నుల వరకు పనసకాయలను వ్యాపారులు తరలిస్తున్నారు.జయపురం మార్కెట్ నుంచి కటక్, కోల్‌కతా వంటి పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. మన్యంలో సైతం గత మూడేళ్ల కాలంలో ఈ ఏడాది పనస చెట్లన్నీ పనస కాయలు పదుల సంఖ్యలో విరగ్గాసాయి.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

నక్కపల్లి: ప్రముఖ ప్రాచీన శివాలయం ఉపమాక శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం శనివారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అంతకుముందు స్వామివారి ఆలయంలో విశేష హోమాలు నిర్వహించారు. స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఎదురు సన్నాహ మహోత్సం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, వెలవలపల్లి మహేష్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ప్రముఖ తెలుగు పండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి, ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు కొల్నాటి బుజ్జి పాల్గొన్నారు.

విస్తారంగా మిరప సాగు



దాలివలసలో సాగులో ఉన్న మిరప పంట

కె.కోటపాడు : మిరప పంటను మండలంలో పలు గ్రామాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. సాగు కాలంలో 15 రోజులకు ఒక మారు నీటి తడుపు అందించాలని, ఈ విధంగా సాగు చేస్తే మొక్కనాటిన 45 రోజులకు మిరపపంట పూతదశకు చేరుకోవడంతో దిగుబడి ప్రారంభం అవుతుందని రైతులు తెలిపారు. మండలంలో దాలివలస, పిండ్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవాని పాలెం, మద్రివలస, శృంగవరం, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో 150 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

జీడిమామిడి రైతులపై ప్రకృతి కన్నెర్ర

నాతవరం: ఆకాల వర్షాలతో జీడిమామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు పంట దశలో ఉన్న జీడి తోట పిందే రాకుండా మాడిపోతోంది. అనకాపల్లి జిల్లాలో గల 24 మండలాల్లో 28 వేల హెక్టార్లలో రైతులు జీడిమామిడి తోటలు సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికంగా నాతవరం మండలంలో 3100 హెక్టార్లు, నక్కపల్లిలో 2678 హెక్టార్లు, రావికమతంలో 1685 హెక్టార్లు, గొలుగొండ లో 1428 హెక్టార్లు, నర్సీపట్నంలో 1265 హెక్టార్లు, మాకవరపాలెంలో 1239 హెక్టార్లు, యలమంచిలిలో 1118 హెక్టార్లలో సాగు చేయ గా ఇతర మండలాల్లో సాధారణ విస్తీర్ణంలో పెంచుతున్నారు. అయితే పంట చేతికంది వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో దిక్కుతోచని స్థితిలో రైతులున్నారు. వాస్తవంగా ఈ ఏడాది మొదట్లో వాతావరణం బాగుండటంతో ఎకరానికి 300 కేజీలకు పైగా దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

మాడుగుల: పురాతన పార్థసారథి స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పూల నగలతో అలంకరించారు. పండితుల వేద మంత్రాల నడుమ అత్యంతం వైభవంగా రాములోరి కల్యాణం జరిగింది. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. పురాతన సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారదాచార్యులు, వాసులు దేవాదయ ధర్మాదయ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు కల్యాణంతో ఘనంగా ముగిశాయి.



రాములోరి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జిల్లా స్థాయి భజన పోటీలు రేపు

మాడుగుల రూరల్: ఈ నెల 4న కె.జె.పురం పాలగెడ్డ వద్ద గల బాలాంజనేయ స్వామి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 3వ తేదీ సోమవారం సాయంత్రం లోగా తమ నామినేషన్ ఫీజు రూ.200 ఆలయ కమిటీకి చెల్లించాలని చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.ఎల్.పి.రావు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిపాలనాధికారి పప్పల వెంకటరమణమూర్తి(దాసు) వ్యవహరిస్తారన్నారు. భజన పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.12,116, ద్వితీయ బహుమతిగా రూ.8,116, తృతీయ బహుమతిగా రూ.6,116ను దాతల సహకారంతో అందిస్తామని తెలిపారు. ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహిస్తామన్నారు.